క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు



ప్రత్యేక అలంకరణలో పీర్లు

కూడేరు: పి. నాగిరెడ్డిపల్లిలో బుధవారం మొహర్రం వేడుకల్లో భాగంగా పెద్ద సరిగెత్తు(పానకాలు) కార్యక్రమాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముజావర్ పీర్లను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు మరువల్లో పానకాన్ని మంగళవాయిద్యాల నడుమ పీర్ల చావిడి దగ్గరకు తీసుకెళ్లారు. చక్కెర, బెల్లం చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం పీర్లు జలధికి వెళతాయని ముజావర్, నిర్వాహకులు తెలిపారు.

29న మండల మీట్

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 29న ఎంపీపీ గంగాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా 'అయ్యంకి' జయంతి



అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ ప్రకాష్‌రెడ్డి

యల్లనూరు: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయంలో బుధవారం అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ ప్రకాష్‌రెడ్డి అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణయ్య ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తుడని, గ్రంథాలయ సర్వస్వం అనే పత్రికను నిర్వహించారన్నారు. ఆయనకు 1972లో భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం అందించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రామచంద్ర, వెంకటాద్రిపల్లి ప్రసాద్, పాఠకులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ మృతికి నివాళి

యల్లనూరు: నర్సాపురం ఎంపీడీఓ వెంకటరమణరావు అకాల మరణంపై బుధవారం ఎంపీడీఓ వీరరాజు, ఏవో రామచంద్రారెడ్డి, ఏపీఓ షబ్బీర్‌బాషా మండల పరిషత్ కార్యాలయంలో నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఖలందర్, అటెండర్ కుళ్లాయమ్మ, కంప్యూటర్ ఆపరేటర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



టెట్రా ప్యాకెట్లను చూపుతున్న సీఐ, సిబ్బంది

యల్లనూరు: చింతకాయమంద గ్రామంలో ఓ వ్యక్తి నుంచి పోలీసులు కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు గ్రామంలో సోదాలు చేపట్టారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన కారంపొడి రామాంజినేయులు అనే వ్యక్తి ఇంట్లో 384 కర్ణాటక ప్యాకెట్లు పట్టుబడ్డాయి. ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఏఎస్‌ఐ సంపత్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, కానిస్టేబుళ్లు నరేంద్రారెడ్డి, కృపాకర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, వీర తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీని నీరుగారుస్తున్న ప్రభుత్వాలు'



మాట్లాడుతున్న రంగయ్య

తాడిపత్రి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని నీరుగారుస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య విమర్శించారు. స్థానిక రంగప్ప కాలనీలో బుధవారం సంఘం నియోజక వర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరవు ప్రాంతాల వారికి కల్పతరువుగా మారిన పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. సరైన ఉపాధి అవకాశాలు లేక పేదలు ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారన్నారు. ఏడాదిలో ప్రతి కుటుంబానికి 200 పని దినాలు కల్పించాలని, రోజు రూ.600 వేతనం అందించాలన్నారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులను అమలు పరచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు సూర్యనారాయణ, నాగరంగయ్య, బాలనాయుడు, రామేశ్వరరెడ్డి, ఓబులేసు, ఎర్రప్ప, రామలక్ష్మమ్మ, ఫాతిమా, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముందుకు కదలని మురుగు

- పామిడిలో డ్రైనేజీ అస్తవ్యస్తం
- మురికికూపాలుగా వ్యవసాయ కాలువలు
- ఇబ్బందుల్లో ప్రజలు



పామిడిలో మురికి కూపంగా మారిన పెద్దకాలువ

పామిడి: పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో 32 వేల జనాభా ఉంది. పట్టణం మీదుగా ఆయకట్టు కాలువలైన పెద్దకాలువ, గంగిరెడ్డి కాలువ వెళ్తుంటాయి. అయితే కాలక్రమేణా వీటికి సాగునీరు రావడం లేదు. దీంతో పట్టణ ప్రజలు తమ ఇళ్ల నుంచి వచ్చే మురుగునీటిని వీటిలో వదులుతున్నారు. దీంతో వ్యవసాయ కాలువలు కాస్త మురికికూపాలుగా మారాయి. నెహ్రూ కాలనీ, మడికట్ల ఆంజనేయ స్వామి వీధి, బెస్తవీధి, కాగితాల వీధి, పామిడమ్మ, వీధి మీదుగా పెద్దకాలువ వెళ్తుంది. ఈకాలనీలో మురుగునీరంతా పెద్దకాలువలో వదిలేస్తున్నారు. అయితే కాలువలో పూడిక పేరుకుపోవడంతో మురుగునీరు ముందుకు సాగడం లేదు. వర్షాకాలంలో వర్షపునీరు తోడవడంతో కాలువ పొంగి మురుగునీరు రోడ్లపైకి, ఇళ్లలోకి చేరుతోంది. వడ్డే వీధి, ఆముదాల వీధి, పీఎండీ కాలనీ, దుర్గమ్మ వీధి, అంబేడ్కర్‌కాలనీ గుండా గంగిరెడ్డి కాలువ వెళ్తుంది. ఆయా వీధుల్లోని మురుగునీరంతా ఈ కాలువలోకి వదులుతుంటారు. అయితే ఈ కాలువలో పూడిక పేరుకుపోవడంతో మురుగు ముందుకు సాగడం లేదు.

ప్రణాళికా లోపం.. ప్రజలకు శాపం

పట్టణంలో చాలా కాలనీల్లో సీసీరోడ్లు నిర్మించినా డ్రైనేజీల గురించి పట్టించుకోలేదు. ఇక పలు కాలనీల్లో ప్రణాళిక లేకుండా డ్రైనేజీలు నిర్మించారు. దీంతో మురుగునీరు మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచి పోతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. మురుగునీరు నిల్వ ఉండటంతో దోమల బెడద ఎక్కువైంది. సాయంత్రం అయిందంటే చాలు దోమలు ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయి. అసలే సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో డ్రైనేజీ సమస్య తోడవడం ప్రజలను మరింత ఆందోళనకు గురి చేస్తోంది.

దుర్గంధం వెదజల్లుతోంది



పామిడిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీల్లో పూడికతీత పనులు సక్రమంగా జరగడం లేదు. దీంతో కాలువలు పొంగి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఇంట్లో అన్నం కూడా తినలేని దుస్థితి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–సురేంద్ర, పామిడి

విష పురుగుల బెడద



డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతోంది. వర్షాకాలంలో మురుగు కాలువలు పొంగిపొర్లుతున్నాయి. ఒక్కోసారి ఇళ్లలోకి మురుగునీరు చేరుతోంది. దీనికితోడు విషపురుగుల బెడద తప్పడం లేదు.

–గంగాదేవి, పామిడి

రోగాలు వెంటాడుతున్నాయి



డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వ ఉండడంతో దోమల బెడద అధికమైంది. దీంతో రోగాలు వెంటాడుతున్నాయి. అధికారులు డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలి.

–రాముడు, పామిడి

కాలువల్లో పూడిక తీయించాం



పామిడిలోని గంగిరెడ్డికాలువ, పెద్దకాలువల పూడిక తీయించాం. అయినప్పటికీ కాలువల గుండా మురుగునీరు పారుతోంది. దీంతో కాలువలు తొందరగా పూడికమయమవుతున్నాయి. సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–చంద్రశేఖర్, ఈఓ, పామిడి పంచాయతీ

మధ్యాహ్న భోజనం అమలు చేయాలి



సమావేశమైన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

శింగనమల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం పథకం అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు గిరి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో అమలు చేయాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో చేరిన విద్యార్థులందరూ పేదలన్నారు. విద్యార్థులకు వెంటనే పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. కళాశాలలో సైన్స్ గ్రూపులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం శింగనమల మండల కమిటీ అధ్యక్షుడిగా సాయి, ప్రధాన కార్యదర్శిగా జాన్సన్‌ను ఎన్నుకున్నారు.

ఢిల్లీ ధర్నాకు తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలు



ఢిల్లీలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, మున్సిపల్ వీసీ నైరుతిరెడ్డి, సోదరులు భీమిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం కొనసాగిస్తున్న ఆటవిక, అరాచక పాలనకు వ్యతిరేకంగా మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో చేపట్టిన ధర్నాకు స్థానిక నేతలు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ సోదరులు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డితో పాటు గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు వై.భీమిరెడ్డితో పాటు ఆదోని, మంత్రాలయం యువనేతలు ప్రదీప్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి ధర్నాలో పాల్గొని తమ నిరసన గళాన్ని వినిపించారు. అనంతరం వారు జగనన్నను కలిసి స్థానికంగా ఎన్‌డీఏ కూటమి కొనసాగిస్తున్న అరాచకాలపై వివరించారు.

పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

గార్లదిన్నె: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంలో ఎంఈఓ చంద్రనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లింగమయ్య మాట్లాడుతూ ప్రీ ప్రైమరీతో పాటు ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఒకే పాఠశాలలో నడపాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్ అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, పని భారం తగ్గించాలన్నారు. హైస్కూల్ లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలన్నారు. మినిమం టైం స్కేల్ అమలు చేసి ఉపాధ్యాయుల సర్వీసును రెగ్యులర్ చేయాలన్నారు. పాఠశాలకు రావాల్సిన అన్ని రకాల గ్రాంట్లు మంజూరు చేసి విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలన్నారు. యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి వీరేశ్వరాచారి, శివ రుద్రప్ప, రాధిక, శివ మూర్తి, నాగభూషణ, రామాంజినేయులు, రేవతి, సౌజన్య, వెంకట ప్రసాద్, శాంతి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు జాషువా



సాహిత్యపీఠం ఆధ్వర్యంలో జాషువాకు నివాళి

అనంతపురం కల్చరల్: నవయుగ వైతాళికుడుగా సమసమాజ నిర్మాణం జరగాలని భావించిన మహాకవి జాషువా అని పలువురు రచయితలు, కవులు పేర్కొన్నారు. గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా బుధవారం పలువురు రచయితలు, కళాకారులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. జాషువా సాహిత్య పీఠం నాగలింగయ్య ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ జాషువా గొప్పతనాన్ని కొనియాడారు. అనంతరం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జరిగిన సాహితీ సదస్సుకు ఆచార్య బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఆత్మీయ అతిథిగా మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్, జనప్రియ కవి ఏలూరు యంగన్న, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ దివాకరరెడ్డి, డాక్టర్ జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి, హెచ్.నాగలింగయ్య, డాక్టర్ నానీల నాగేంద్ర, డాక్టర్ అంకే శ్రీనివాస్, సుబ్బయ్య తదితరులు హాజరై మాట్లాడారు. జాషువా సాహిత్యం విశ్వజనీనమైనదని.. పామర పండితులకు సరళంగా అర్థమయ్యే భాషలో రాసిన కవులు అరుదుగా ఉంటారన్నారు. ఆయన రాసిన గబ్బిలం, ఫిరదౌసి, బాపూజీ, కాందిశీకుడు మొదలైన కావ్యాలు వేటికవే తెలుగు సాహిత్య గొప్పతనాన్ని జాతీయస్థాయిలో చాటాయని గుర్తు చేశారు. వర్గ సమాజం పోవాలని కుల రహిత సమాజం కోసం పాటుపడిన జాషువా సాహిత్యాన్ని మరింత విస్తృతం చేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పూజారి ఈరన్న, టీవీ రెడ్డి, యోగేశ్వర నాయుడు, రియాజుద్దీన్, రామచంద్ర, బీసీ లక్ష్మణ్ణ, అశ్వర్థ రెడ్డి, ప్రజాగాయకుడు దాసరి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొంతువాపు వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు



గొటుకూరులో టీకా వేస్తున్న పశు వైద్య సిబ్బంది

కూడేరు: గేదెలకు వచ్చే గొంతు వాపు వ్యాధిని పశు పోషకులు నిర్లక్ష్యం చేయొద్దని మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు సూచించారు. బుధవారం గొటుకూరు గ్రామంలో పశు వైద్యాధికారులు గేదెలకు గొంతు వాపు వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గొంతు వాపు వ్యాధి బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుందని, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం కాగలదని పశువైద్యాధికారి తెలియజేశారు. ఈ వ్యాధి వర్షా కాలంలో ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని, పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి



మోదకాల అలంకారంలో వినాయకుడు

అనంతపురం కల్చరల్: స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం, చెరువుకట్ట, రాంనగర్‌లోని కమ్మభవన్, రజక నగర్‌లోని సంకష్టహర వినాయక ఆలయం, రైల్వేస్టేషన్ సమీపంలోని సిద్ధి గణపతి ఆలయం తదితర చోట్ల బుధవారం సంకష్టహర చతుర్థి వ్రతాలు ఘనంగా జరిగాయి. వినాయకుడిని 108 కుడుములతో అలంకరించి ఆరాధించారు. వేదపండితులు వ్రతకథలు చెపుతుంటే బారులు తీరి భక్తులు భక్తిశ్రద్ధలతో వినాయక ప్రతిమకు పూజలు చేశారు. నియమనిష్ఠలతో చేసిన ఉపవాస దీక్షను ముగించారు. అనంతరం కుడుములను నైవేద్యం చేసి భక్తులకు వితరణ చేశారు. మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం జరిగాయి.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: అనాథ మృతదేహానికి ఆపద్బాంధవ ట్రస్టు సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు..మతిస్థిమితం లేని 18 ఏళ్ల వ్యక్తి గత కొన్ని నెలలుగా స్థానిక గవిమఠం వద్ద ఉంటున్నాడు. అనారోగ్యం కారణంగా బుధవారం మృతి చెందాడు. ఎవరూ లేకపోవడంతో ఆపద్బాంధవ ట్రస్టు వ్యవస్థాపకులు మురళీ, సభ్యులు నూర్, భీమేష్, బాషా, అశోక్, రమేష్, నవీన్‌తో పాటు హెడ్‌కానిస్టేబుల్ జయకుమార్, సోమశేఖర్ తదితరులు అనాథ మృతదేహాన్ని వెలిగొండ రోడ్డులోని శ్మశాన వాటికకు తీసుకెళ్లి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి వాటర్ పైప్‌లైన్ లీకేజీ



బీసీసీ రోడ్డుపై కొత్తబస్టాండ్ వద్ద లీకేజీ అవుతున్న నీరు

పామిడి: స్థానిక గుత్తి బీసీసీరోడ్డులోని కొత్తబస్టాండ్ సమీపాన సత్యసాయి వాటర్ పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. గత వారం రోజులుగా పైప్‌లైన్ లీక్ అవుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో నీరంతా వృథా అవుతోంది. లీకేజీ నీరంతా రోడ్డుపైకి రావడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులకు గురౌతున్నారు. లీకేజీ నీరు దగ్గరలోని లోతట్టు ప్రాంతమైన క్రైస్తవ సమాధుల్లోకి వెళుతోంది. శ్మశానవాటికలో నీటి నిల్వతో సమాధుల్లోకి వెళ్లలేని దుస్థితి నెలకొందని క్రైస్తవులు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు తక్షణం స్పందించి పైప్‌లైన్ లీకేజీ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించాల్సిందేనా!



గుత్తి ఆర్‌ఎస్ రోడ్డులో రోడ్డు పక్కనే పెద్ద గుంత తవ్వి వదిలేసిన దృశ్యం

గుత్తి: పైప్‌లైన్ మరమ్మతు కోసం తవ్విన గుంత ప్రమాదకరంగా మారింది. వివరాలు..గుత్తి ఆర్‌ఎస్ రోడ్డులో వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ప్రధాన రహదారి పక్కనే మున్సిపల్ వాటర్ వర్క్ సిబ్బంది పైప్‌లైన్ మరమ్మతు కోసం రెండు వారాల క్రితం పెద్ద గుంత తవ్వారు. పైప్‌లైన్‌ను మరమ్మతు చేసిన తర్వాత గుంత పూడ్చలేదు. రాత్రిపూట ప్రమాదాలు జరిగే అవకాశముందని వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి గుంత పూడ్చి వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

27న ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు రెండో విడత కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. విద్యాసాగర్ బుధవారం తెలిపారు. రెండో విడత కౌన్సిలింగ్‌కు సర్టిఫికేషన్ వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావలెనని సూచించారు.

ముగిసిన మొహర్రం

పెద్దవడుగూరు: చిత్రచేడు గ్రామంలో మొహర్రం వేడుకలు బుధవారం ప్రశాతంగా ముగిశాయి. తెల్లవారు జామున నుంచి పీర్ల స్వాములను గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. సాయంత్రం పీర్ల స్వాములు అగ్నిగుండ ప్రవేశం చేశాయి. అనంతరం జలధికి తరలివెళ్లాయి. భక్తులు పెద్ద ఎత్తున పీర్ల చావిడి వద్దకు చేరుకొని చక్కెర చదివింపులు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్‌ఐ చిన్న రెడ్డప్ప ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

విధులు సక్రమంగా నిర్వర్తించండి

పెద్దవడుగూరు : గ్రామ సచివాలయాల ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ గోపీకృష్ణ ఆదేశించారు. బుధవారం ఆయన మేడిమాకులపల్లి, గుత్తిఅనంతపురం గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మూమెంట్ రిజిస్టర్, ఇతర రికార్డులను పరిశీలించారు. సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు.

నేడు గుత్తిలో డీఆర్‌ఎం పర్యటన

గుత్తి: స్థానిక రైల్వే డీజిల్ షెడ్‌లో గురువారం గుంతకల్లు డీఆర్‌ఎం విజయ్ కుమార్ పర్యటించనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం చెప్పారు. ఇండియన్ రైల్వే వ్యాబ్ టెక్ కంపెనీ 250 డబ్ల్యూడిజి లోకో ఇంజిన్లను గుత్తి రైల్వే డీజిల్ షెడ్-వ్యాబ్‌టెక్ కంపెనీ సంయుక్తంగా నిర్వహించనున్నాయి. ఇప్పటికే గుత్తి రైల్వే డీజిల్‌షెడ్‌కు 130 వ్యాబ్ టెక్ కంపెనీ ఇంజిన్లు వచ్చాయని, వాటిని డీఆర్‌ఎం ప్రారంభిస్తారని రైల్వే అధికారులు తెలిపారు.

సమయపాలన పాటించండి



రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ నాగేశ్వరి

గుత్తి: అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరి సూచించారు. బుధవారం ఆమె పట్టణంలోని కుమ్మర వీధి, హోరబ్ చర్చి,చెట్నేపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అన్ని రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు.

బాల్య వివాహాలు అనర్థదాయకం

తాడిపత్రిటౌన్: బాల్య వివాహాలు అనర్థదాయకమని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాలు, గృహహింస, పోక్సో తదితర చట్టాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సాజిదాబేగం మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. అలాగే పోక్సో, గృహహింస చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్, ఎస్‌ఎస్ పీఓ శ్రీధర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేజీబీవీలో ఆధార్ సేవలు

కూడేరు: మండల కేంద్రంలోని కస్తుర్బా బాలికా విద్యాలయం(కేజీబీవీ)లో గురువారం నుంచి రెండు రోజులు పాటు ఆధార్ నమోదు, అప్‌డేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శులు ప్రభావతి, రఘు బుధవారం తెలిపారు. అవకాశాన్ని సచివాలయం-1, 2 పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మూడు సచివాలయాల్లో ఆధార్ సేవలు

యల్లనూరు: యల్లనూరు, గడ్డంవారిపల్లి, చింతకాయమంద గ్రామ సచివాలయాల్లో ఈనెల 27 వరకు ఆధార్ సేవలు అందించనున్నట్లు ఎంపీడీఓ వీరరాజు బుధవారం తెలిపారు. అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

డ్రైనేజీలపై కట్టడాల తొలగింపు



అక్రమ కట్టడాల తొలగింపును పర్యవేక్షిస్తున్న కమిషనర్ వెంకట రమణయ్య

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మార్కెట్ వెనుకవైపున గల రోడ్డులో డ్రైనేజీపై నిర్మించుకున్న కట్టడాలను టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. బుధవారం కమిషనర్ వెంకటరమణయ్య, ఏసీపీ అబ్దుల్‌సత్తార్, టీపీఎస్ మురళీ పర్యవేక్షణలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అక్రమ నిర్మాణాలను తీసివేయించారు.

తహసీల్దార్‌కు వీడ్కోలు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

తాడిపత్రి రూరల్: స్థానిక తహసీల్దార్ ఆంజనేయులు బదిలీ కావడంతో బుధవారం ఆయనకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈయన ఎన్నికల సమయంలో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుంచి బదిలీపై తాడిపత్రికి వచ్చారు. ఎన్నికలు పూర్తి కావడంతో ప్రభుత్వం ఆయన్ను తిరిగి పాత జిల్లాకు పంపుతూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈసందర్భంగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది తహసీల్దార్ సేవలను కొనియాడారు. అనంతరం ఆయన్ను పూలమాలలు, శాలువాతో సత్కరించారు.